క్లుప్తంగా

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్: రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ తన తండ్రి శ్రీనివాసన్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. సందర్భంగా శ్రీనివాసన్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ఇందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్ని శ్రీనివాసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. నాయకులు భాస్కర్, బుల్లెట్ అప్పు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

బంగారుపాళెం: మండలంలోని బలిజపల్లెలో సోమవారం ప్రబోధ సేవాసమితి సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించి గ్రంథాలను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు ధనంజయ మాట్లాడుతూ, క్షర పురుషుడు, అక్షర పురుషుడు, పురుషోత్తముడు వంటి మూడు ఆత్మల విధానంపై తెలియజేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక





గుణశేఖర్, రమేష్, ఎస్ఎన్ బాషా

యాదమరి: ఎస్టీయూ మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉదయం జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు గంటామోహన్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో మండల అధ్యక్షులుగా గుణశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఎస్ఎన్. బాషా, జిల్లా శాఖ కౌన్సిలర్లుగా మదన్‌మోహన్ రెడ్డి, సుబ్రమణ్యం, గణపతి, రంగనాథం, ఓబుల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

కర్ణాటక మద్యం సీజ్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న భాగ్యరాజ్ (25) అనే నిందితుడిని చిత్తూరు టూ టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు సంతపేట వద్ద తనిఖీలు చేస్తుండగా భాగ్యరాజ్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తనిఖీ చేయగా 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయి. అతన్ని అరెస్టు చేసినట్లు సీఐ ఉలసయ్య తెలిపారు.

రేపు పడిమెట్ల పూజోత్సవం




సదుం: అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న పడిమెట్లు

సదుం: మండలంలో ఎర్రాతివారిపల్లె కోటమల్లె అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 27న పడిమెట్ల పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం నుంచి నిర్వహించే పూజోత్సవానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు.

28న పలమనేరులో విద్యుత్ అదాలత్

గంగవరం: ఈ నెల 28వ తేదీన పలమనేరు సబ్ డివిజన్‌లో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఇందులో పలువురు విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. డివిజన్‌లోని పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వికోట మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

సైకిల్ స్టాండ్ ప్రారంభం



పుంగనూరు: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో వాసవీ వనితా క్లబ్, పూర్వ విద్యార్థులు కలిసి రూ.50 వేలు ఖర్చు చేసి సైకిల్ స్టాండ్‌ను నిర్మించినట్లు హెచ్ఎం రుద్రాణి తెలిపారు. ఆమె సోమవారం సైకిల్ స్టాండ్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 1970– 1975 సంవత్సరాలకు చెందిన విద్యార్థులు స్కూల్‌లో సైకిళ్ల కోసం రేకుల షెడ్డు నిర్మించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అపర్ణ, విశాలక్ష్మి, సుజాత, ముత్యాలు, క్లబ్ ప్రతినిధులు వెంకటేష్, ప్రభాకర్, శివప్రసాద్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్



యాదమరి: చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న క్రైస్తవులు



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సన్మానిస్తున్న చర్చి నిర్వాహకులు



ఐరాల: చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ రాజారెడ్డి



గుడిపాల: వివిధ అలంకరణలో ఏసుప్రభువు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక భజనలు చేశారు. క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత ప్రబోధకులు బైబిల్ సందేశం వినిపించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

- చిత్తూరు టౌన్ చర్చిలో క్రీస్తు జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు ఏసయ్య జన్మ విశేషాలతో కూడిన శుభ సందేశం విన్నారు. పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్‌దాస్ వాక్యోపదేశం చేశారు. బైబిల్ ప్రవచనాలు వినిపించారు.
- పలమనేరు రోడ్డులోని జాన్‌బాస్కో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ రూతు మరియన్న, సహాయ ఫాదర్ అనీల్ మాట్లాడుతూ కొత్త శకాన్ని ప్రారంభించిన క్రీస్తు శుభ జన్మదినాన ప్రజలందరూ పరస్పరం శాంతి సౌభాగ్యాలతో జీవిస్తూ లౌకిక వాదాన్ని పరిరక్షించాలన్నారు.
- లక్ష్మీనగర్‌కాలనీలోని బీటీ మెమోరియల్ చర్చి, తెలుగు లూక్స్ చర్చి, రీడ్స్‌పేట చర్చి, జానకారపల్లిలోని హోసన్నా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రదర్శించిన గీతాలాపనలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే....

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. తొలుత బీటీ మెమోరియల్ చర్చికి వెళ్లారు అక్కడి నిర్వాహకులు ఆయన సన్మానించారు. అనగల్లులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని క్రైస్తవులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు జననం, శాంతి సందేశాలను వివరించారు. కట్టకిందపల్లె, బసవాపల్లె, పాపిశెట్టిపల్లె, పల్లూరు, గుడిపాల, బొమ్మసముద్రం, రాసనపల్లె దళితవాడలో యువత ఆధ్వర్యంలో మట్టిపోసి పచ్చి గరికను ఏర్పాటుచేసి ఏసు ప్రభువును ఏర్పాటుచేశారు. సియోన్‌మల్లె చర్చిలో భారీ కేక్‌ను కట్ చేశారు. కుప్పిగానిపల్లె చర్చిలో మధుసూదన్‌రాయల్ మహిళలకు చీరలు, పురుషులకు చొక్కాలు, పంచెలు పంపిణీ చేశారు.




తవణంపల్లె : ఎగువ మత్యం చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్, క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



పూతలపట్టు: క్రిస్మస్ సందర్భంగా క్రీడాపోటీల్లో పాల్గొన్న యువకులు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలను విద్యుద్దీపాలతో, రంగుల కాగితాల్లో అలంకరించారు. చర్చిలో సోమవారం ఉదయం నుంచి ఫాస్టర్లు ఏసుక్రీస్తును ప్రార్థించారు. ఏసుక్రీస్తు జననం గురించి వివరించారు. మండలంలోని ఎగువ మత్యం, తవణంపల్లె, అరగొండ, దిగువమత్యం, గాజులపల్లె, తొడతర, సరకల్లు, పత్రపల్లె, పట్నం, ఉత్తరబ్రాహ్మణపల్లె, పుణ్యసముద్రం, కృష్ణాపురం, కట్టకిందపల్లె, ముత్తుకూరు, మారేడుపల్లె, చెర్లోపల్లె, ఐరాల క్రాస్‌లోని జీఎస్ఐ చర్చిల క్రైస్తవులు ఆట, పాటలతో సంతోషంగా జరుపుకున్నారు. అన్నదానం చేశారు. ఆటల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. పలు చర్చిల్లో శనివారం రాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి దైవ సందేశాన్ని అందించారు. ఏసుప్రభువు చూపిన ప్రేమ, కరుణ, దయ, ప్రేమలను తోటి వారిపట్ల చూపాలని పాస్టర్లు సందేశం ఇచ్చారు. రెడ్డివారిపల్లెలోని సీయోను ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ పురస్కరించుకుని పాస్టర్ రాజారెడ్డి పేదలకు చీరలను పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని క్రైస్తవ సోదరులు సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కరిడివారిపల్లె, నలగాంపల్లె, బంగారుపాళెం, ముంగరమడుగు, మాధవనగర్, తిమ్మోజుపల్లె, గుండ్లకట్టమంచి, తగ్గువారిపల్లె, బండ్లదొడ్డి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. యేసు జీవిత చరిత్ర పై చర్చి ఫాస్టర్లు సందేశమిచ్చారు. యేసుప్రభువు పుట్టిన రోజు సందర్భంగా చర్చిల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలోని కొనాపల్లె, పెరగాండ్లపల్లె, మాదిరెడ్డి పల్లె, మాధవరం, కోడిగుట్ట, పేరకూరు, వరదరాజులపల్లె, కోయూరు, కీనాటంపల్లె, చిన్నంపల్లె గ్రామాల్లో వెలసిన చర్చిలలో క్రిస్టియన్ సోదరులు వేకువజామున నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. కీనాటంపల్లె, చిన్నంపల్లె గ్రామాల్లోని చర్చిలలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేదలకు దుస్తులు అందజేశారు. అనంతపురం గ్రామంలో సాయంత్రం క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.





చిత్తూరు: టూన్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు, బంగారుపాళెం: కరిడివారిపల్లె చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, గుడిపాల: కుప్పిగానిపల్లె చర్చిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మధుసూదన్‌రాయల్

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ హనుమంతరావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహిస్తామన్నారు. 11 గంటలకు స్వామికి శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు. రాత్రి 8 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందన్నారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలు, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



మొక్కలు పంపిణీ చేస్తున్న జగదీశ్వరనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: భారత మాజీ ప్రధాని, ఓబీసీ సహా వ్యవస్థాపకుడు వాజ్‌పేయి జయంతిని సోమవారం బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి, నాయకులు నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు 500 పూల మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రవి, బ్రహ్మానందరెడ్డి, సిద్దు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా బీజేపీ కార్యాలయంలో నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలో సోమవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు ఆధ్వర్యంలో 197 రామాపురం, కిల్లారిపల్లె, చీలాపల్లెలో జెండా ఎగురవేసి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సోమనాథ్‌గౌడ్, ఏలుమలై, కుమార్‌బాబు, శేఖర్, శరవణ, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధార్మిక చైతన్యం కలిగి ఉండాలి



ర్యాలీ చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

కుప్పం రూరల్ : ప్రతి ఒక్కరూ ధార్మిక చైతన్యం కలిగి ఉండాలని బంగారుపాళ్యం బ్రహ్మానంద ఆశ్రమం స్వామిజీ కేశవానంద తెలిపారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుప్పం పట్టణంలోని శివాలయంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషీ ధార్మిక చైతన్యం కలిగి ఉండడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని చెప్పారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని హిందువులు సమ్మిళితమై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పట్టణంలో హిందూ సమ్మేళనం ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు.

శాస్త్రోక్తంగా హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా యజ్ఞ భజనలు చేస్తున్న నిర్వాహకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆస్థాన మండపంలో శాస్త్రోక్తంగా హనుమాన్ చాలీసా యజ్ఞ భజన కార్యక్రమాలను రామాంజనేయ నామ సంకీర్తన మండలి సభ్యులు నిర్వహించారు. చెన్నైకు చెందిన సంకీర్తన మండలి సభ్యులు సోమవారం ఉదయ్‌కుమార్ బృందం 108 హనుమాన్ చాలీసా సంకీర్తనలు నిర్వహించడానికి విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ఆస్థాన మండపంలో సంకీర్తనలు ప్రారంభించారు. సంకీర్తన మండలి బృందం శాస్త్రోక్తంగా భక్తులకు వీనుల విందుగా వినిపించారు. అనంతరం వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, రామాయణ హరినాథ్ రెడ్డి, నిర్వాహకులు భాస్కర్ నాయుడు, జగదీష్ నాయుడు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు క్రీడా మైదానాలు సిద్ధం

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ
- ఏర్పాట్ల పరిశీలన
- నేటి నుంచి క్రీడోత్సవాలు ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ జె అరుణ

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల నిర్వహణకు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ జె అరుణ తెలిపారు. ఇందులో భాగంగా నగరంలో నాలుగు క్రీడా మైదానాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ఆమె సోమవారం సాయంత్రం మెసానికల్ మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాస్థాయిలో పోటీలను ఇక్కడ నుంచే ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో ఆరోగ్యకర జీవనాన్ని పెంపొందించడం, క్రీడలు, వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేయడం, క్రీడల్లో ప్రతిభను వెలికి తీయడంలో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడలకు అనుగుణంగా మైదానాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, సీఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4 క్రీడా మైదానాలు..
51 వార్డు సచివాలయాలు

ఆడుదాం ఆంధ్రా క్రీడల కోసం నగరపాలక సంస్థ పరిధిలో మెసానికల్ గ్రౌండ్, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానం, బీఎస్ కణ్ణన్ కళాశాల మైదానం, సంతపేట పీఎన్‌సీ హై స్కూల్ మైదానాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ చెప్పారు.

మెసానికల్ మైదానంలో: 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 38, 39, 51 వార్డు సచివాలయాలకు సంబంధించి క్రీడలు జరుగుతాయి.

పీవీకేఎన్ డిగ్రీ కాలేజ్ మైదానంలో: 12, 13, 14, 15, 16, 17, 18, 19 వార్డు సచివాలయాలు.

కణ్ణన్ కళాశాల మైదానంలో: 20, 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37 వార్డు సచివాలయాలు.

సంతపేట పీఎన్‌సీ హైస్కూల్ మైదానంలో: 40, 41, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50 వార్డు సచివాలయాలకు సంబంధించిన క్రీడలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర

ఐరాల: మండలంలో ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26 నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 19 గ్రామ సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను సమన్వయం చేసుకుని పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా సచివాలయ పరిధిలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యేచే పోటీలు ప్రారంభం

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 10 గంటలకు క్రీడా పోటీలను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

జెడ్పీ వైస్‌చైర్మన్ హాజరు

యాదమరి: మండల పరిధిలో సోమవారం నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ, ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ హాజరు కావాలని కోరారు.

నేడు అరగొండలో ఆడుదాం..ఆంధ్రా

తవణంపల్లె: మండలంలోని అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో మంగళవారం నుంచి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అరగొండ, గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లె, సరకల్లు, నలిశెట్టిపల్లె, తవణంపల్లె, పైమాఘం సచివాలయాల్లో మంగళవారం ఆటల పోటీల్లో జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీల సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, స్థానికుల భాగస్వామ్యంతో సచివాలయ సిబ్బంది విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

పూతలపట్టులో...

పూతలపట్టు: మంగళవారం నుంచి సచివాలయాల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల స్థాయిలో ఆడడానికి, వీక్షించడానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తప్పక హాజరు కావాలని తెలిపారు. వారి సచివాలయాల పరిధిలో పంచాయతీ కార్యదర్శి, పీడీలు పొరబాట్లు జరగకుండా క్రీడాపోటీలు నిర్వహించాలన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

ఘనంగా సీతారాముల ఊరేగింపు



పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో సోమవారం సీతారాముల ఊరేగింపును ఘనంగా చేపట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటా అందజేసి జనవరి 22న అయోధ్యలో రాముల వారి ప్రాణ ప్రతిష్ట జరుగు సమయంలో పూజలు చేయాలని నిర్వాహకులు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, మువ్వల నరసింహులుశెట్టి, గోవిందరెడ్డి, దేవేంద్రరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.